
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 2 జనవరి 2025



కూర్మావతారంలో కోదండరాముడు

- భద్రాద్రిలో ఘనంగా ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు
- 2024లో రామయ్యను దర్శించిన భక్తులు 23.74లక్షలు



స్వామివారిని పల్లకిలో మిథిలాస్టేడియానికి తీసుకెళుతున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీసీతారామచంద్రస్వామి కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు శ్రీసీతారామచంద్రస్వామిని ఆలయంలో కూర్మావతారంలో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి నిత్యకల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అక్కడ స్వామివారికి పూజాకార్యక్రమాలు నిర్వహించిన తరువాత వేద పండితులు స్వామివారికి వేద విన్నపాలను సమర్పించారు. అనంతరం నాళాయర దివ్యప్రబంధం, వేదపారాయణం పఠించారు. మధ్యాహ్నం కూర్మావతార రూపుడైన స్వామివారిని మేళతాళాలతో మిథిలా స్టేడియానికి తీసుకురాగా ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

కాగా గురువారం స్వామివారు వరాహావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, కత్తి శ్రీనివాసరావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, కోటి రామస్వరూప్ రాఘవాచార్య పాల్గొన్నారు.

2024లో రామయ్యను దర్శించుకున్న 23,74,215మంది భక్తులు

2024లో భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామిని 23,74,215 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇందులో మేలో అత్యధికంగా 2,48,214 మంది దర్శించుకోగా.. అత్యల్పంగా సెప్టెంబరులో 1,03,352మంది దర్శించుకున్నారు.

పామాయిల్ రైతులకు శుభవార్త



రూ.20,506కు పెరిగిన టన్ను గెలల ధర

6



సత్తుపల్లి మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో కోడి పందాలు, పేకాట జోరుగా సాగుతోంది. ఇటీవల మండలంలోని చెరుకుపల్లి సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న వారి నుంచి రూ. 3.81 లక్షలు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. తాజాగా సత్తుపల్లి మండలం గంగారం, సత్యనారాయణపురం గ్రామాల్లోని పామాయిల్ తోటల్లో పేకాట, కోడి పందాలు జోరుగా నిర్వహిస్తున్నారు.

సరిహద్దుల్లో కాయ్ రాజా కాయ్

- సత్తుపల్లి మండలంలో భారీగా కోడి పందాలు, పేకాట
- పామాయిల్ తోటల్లో యథేచ్ఛగా నిర్వహణ
- రోడ్డు పక్కన ఇష్టారీతిన వాహనాల పార్కింగ్
- రాకపోకలకు ఇబ్బందిపడుతున్న వాహనదారులు

సత్తుపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలంలోని గంగారంలో రెండు రోజులుగా కొందరు వ్యక్తులు భారీస్థాయిలో పేకాట నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. బుధవారం కూడా గంగారంలో పేకాటను నిర్వహించారని చెబుతున్నారు. సత్యనారాయణపురంలో రెండు రోజులుగా కొందరు భారీస్థాయిలో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. సోమ, మంగళవారాల్లో గంగారానికి చెందిన ఒక వ్యక్తికి చెందిన పామాయిల్ తోటలో కోడి పందేలు నిర్వహించారని సమాచారం. బుధవారం ఉదయం వందల సంఖ్యలో బైక్‌లపై పందేల స్థావరం వద్దకు చేరుకొని మధ్యాహ్నం 1.30గంటల వరకు కోడి పందేలు వేశారు. పెద్ద సంఖ్యలో మోటార్ సైకిళ్లను రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో ఆ దారిలో వెళ్లే ఇతర వాహనచోదకులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే ప్రదేశంలో పేకాట నిర్వహించిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి. కొన్ని పేక ముక్కలను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. బుధవారం ఒక రైతు అభ్యంతరం వ్యక్తం చేయటంతో నిర్వాహకులు కోడిపందేలను మధ్యాహ్నం సమయానికి నిలిపివేసి వెళ్లిపోయారని తెలిసింది.



కోడి పందాల స్థావరం వద్ద వదిలేసిన పేక ముక్కలు

4.30గంటలకు చేరుకున్న పోలీసులు

పామాయిల్ తోటలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం సాయంత్రం 4.30గంటల సమయంలో పోలీసు వాహనం సైరన్ మోగిస్తూ ఆ ప్రాంతంలో తిరిగినట్లు కొందరు తెలిపారు. అప్పటికి మూడు గంటల ముందుగానే కోడిపందేలను నిలిపివేసి అందరూ వెళ్లిపోవటం కొసమెరుపు.

నిర్వాహకులు ఎవరు?

కోడి పందేలు, పేకాట నిర్వహిస్తున్నది ఎవరనే విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో ఆర్గనైజ్డ్ కోడి పందేలు నిర్వహించిన సంఘటనలు లేవు. కాని ఇటీవల కాలంలో పందెంరాయుళ్లకు ఆహ్వానం పంపిమరీ భారీ స్థాయిలో (మిగతా 6వ పేజీలో)

కోడి పందాలు, పేకాటపై ఉక్కుపాదం

పలు స్థావరాలపై దాడులు చేసిన పోలీసులు 7

నేటి నుంచి టెట్

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు

ఖమ్మం, ఖానాపురంహవేలి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): టీజీ టెట్-2024 పరీక్షలు గురువారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఖమ్మం డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. ఈ పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణను టీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 10మంది ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను పరిశీలకులుగా నియమించారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 7 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాలు బొమ్మా ఇంజనీరింగ్ కళాశాల ఖమ్మం, దరిపల్లి ఇంజనీరింగ్ కళాశాల ఖమ్మం, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల సత్తుపల్లి, మదర్‌థెరిసా సత్తుపల్లి, ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఖమ్మం, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల ఖమ్మం, విజయ ఇంజనీరింగ్ కళాశాల ఖమ్మం కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నారు.

నియామక పదవుల్లో కదలిక

- ఖమ్మం ఏఎంసీ చైర్మన్ పదవికి హనుమంతరావు పేరు పరిశీలన ?
- పార్టీ పదవులపైనా కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి

ఖమ్మం, జనవరి1(ఆంధ్రజ్యోతిప్రతినిధి): కొత్త ఏడాది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు తీపి కబురు అందబోతోంది. ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవుల నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో ప్రభుత్వ నియామక పదవులతోపాటు పార్టీ వ్యవహారాల పదవులపై కూడా కాంగ్రెస్ దృష్టిపెట్టింది. అందులో భాగంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వీ.వెంకటాయపాలేనికి చెందిన యరగర్ల హనుమంతరావు పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. గతంలో హనుమంతరావు వి.వెంకటాయపాలెం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎంపీటీసీగా గెలిచాడు. బీసీ వర్గానికి చెందిన ఆయనకు రైతుగా, రఘునాథపాలెం మండల నాయకుడిగా గుర్తింపు ఉంది. వివాదరహితుడిగా అందరితో కలిసిపోయే తత్వం ఉండడంతో బీసీకి రిజర్వ్ అయిన ఖమ్మం వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి హనుమంతరావు పేరు ఖరారయ్యే అవకాశం ఉంది. అలాగే ఖమ్మం ఆత్మకమిటీ చైర్మన్ పదవికి రఘునాథపాలెం మండలానికి చెందిన దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం మండలం కాంగ్రెస్ కన్వీనర్‌గా దీప్లానాయక్ పేర్లను పార్టీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది

రహదారులు రక్తసిక్తం

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి
- నూతన సంవత్సరం తొలిరోజే విషాదం



అశోక్ మృతదేహం



షేక్ జాన్‌పాషా(ఫైల్)



నాగచైతన్య(ఫైల్)



సాయికుమార్(ఫైల్)

ఖమ్మం క్రైం/పెనుబల్లి/కూసుమంచి/మణుగూరు టౌన్/అశ్వారావుపేటరూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నూతన సంవత్సరం తొలిరోజు రహదారులు రక్తసిక్తమయ్యాయి. జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం వరకు జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. ఖమ్మం నగరంలో బుధవారం తెల్లవారుజామున బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టిన ఘటనలో తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడు గ్రామానికి చెందిన తుపాకుల సాయికుమార్(25) అనే యువకుడు మృతి చెందాడు. ఖమ్మం నగరంలోని ఐటీహబ్‌లో ఉద్యోగం చేస్తూ మామిళ్లగూడెంలో నివాసం ఉంటున్న సాయికుమార్ మంగళవారం రాత్రి తన స్నేహితులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో సరదాగా గడిపాడు. బుధవారం ఉదయం తన బైక్‌పై బయటకు వెళుతుండగా వీడీవోస్ కాలనీలోని కవిత కాలేజీ సమీపంలో బైక్ అదుపుతప్పి ఓ విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో సాయికుమార్ తలకు తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు అతడిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఇక పెనుబల్లి మండలంలోని పెనుబల్లి-గంగదేవిపాడు గ్రామాల మధ్య మంగళవారం అర్ధరాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. గంగదేవిపాడు (మిగతా 6వ పేజీలో)



మంత్రి తుమ్మలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

ప్రజాభీష్టం మేరకే 'ఇందిరమ్మ' పాలన

- కొత్త ఏడాదిలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: మంత్రి తుమ్మల
- క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు
- మంత్రి తుమ్మలకు పలువురి సన్మానం

6

నయాజోష్‌లో తగ్గిన 'కిక్'

- మద్యం అమ్మకాలపై ఆంధ్రా ఎఫెక్ట్
- ఉమ్మడి జిల్లాలో 30 శాతం పడిపోయిన అమ్మకాలు
- కొనసాగిన కేకులు, బిర్యానీల హవా
- రోడ్లపై విచ్చలవిడిగా స్టాల్స్ ఏర్పాటు
- కొత్త ఏడాది ఖర్చు రూ.100కోట్లు



ఖమ్మం, జనవరి1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు సందడిగా సాగాయి. చిన్నా పెద్దా కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగులు వేశారు. అర్ధరాత్రి వరకు విందులు వినోదాలతో సందడిచేశారు. ఉదయాన్నే ఆలయాలకు బారులుతీరి దైవ దర్శనాలు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో నూతన సంవత్సర వేడుకల ఖర్చు సుమారు రూ.100కోట్ల వరకు జరిగినట్లు తెలుస్తోంది. అయితే నయాజోష్‌లో మద్యం (మిగతా 6వ పేజీలో)

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారు

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

6



మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖ అధికారి వెంకటరమణ

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

- డీటీవో వాకదాని వెంకటరమణ
- జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించటం ద్వారానే ప్రమాదాలు నివారించవచ్చని జిల్లా రవాణాశాఖ అధికారి వాకదాని వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాల యజమానులకు, డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సీటు బెల్ట్ పెట్టుకోవాలని, హెల్మెట్ ధరించాలని, రహదారి పక్కన ఏర్పాటు చేసిన సూచికలను అనుసరించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ రెంటాల స్వర్ణలత, ఏఎంవీఐలు, ఏవో, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జమలాపురం ఆలయానికి పోటెత్తిన భక్తులు

స్వామివారిని దర్శించుకున్న 60 వేల మంది

ఎర్రుపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం భక్తులతో పోటెత్తింది. ప్రభుత్వ సెలవు దినం కావడంతో కొత్త సంవత్సరం ప్రారంభం రోజున శ్రీవారిని దర్శించుకుని సన్నిధిలో గడపాలని భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. దీంతో దేవాదాయశాఖ వాహనాల పార్కింగ్‌స్థలం, క్యూలైన్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. ఆలయ అర్చకులు తెల్లవారుజామునుంచే ప్రాతఃకాల అర్చనలు, నిత్యపూజలు అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం కలిపించారు దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు ఉచిత దర్శనంతో పాటు విశేష దర్శనం, శ్రీఘ్రదర్శనం కల్పించారు. సుమారు 60వేలకుపైగా భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన కేఎస్ఆర్ గ్రానైట్స్ అధినేత తాళ్లూరి కోటేశ్వరరావు నిర్మల కుమారి దంపతులు ఆరు క్వింటాళ్ల కేసరి, పులిహోర ప్రసాదాన్ని భక్తులకు అందించారు. అనంతరం శ్రీవారి భక్తకల్యాణం నిర్వహించి ఉచిత అన్నప్రసాదం అందించారు. శ్రీవారి అర్చనలు, అభిషేకాలు, వాహన పూజలు, తలనీలాలు, లడ్డూప్రసాద విక్రయాలు, అన్నిరకాల ఆర్జిత సేవల ద్వారా రూ.5,10,316లు ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహనరావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, శ్రీసత్యసాయిసేవా సమితి సభ్యులు, గ్రామబృందం పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే 'ఇందిరమ్మ' పాలన

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



తుమ్మలను సన్మానిస్తున్న కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాభీష్టం మేరకే ఇందిరమ్మ రాజ్య పరిపాలన సాగుతోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో పాటు రాష్ట్ర ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, అసంఘటిత కార్మికులు కొత్త సంవత్సరంలో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ అధికారులు, పాత్రికేయులు, వ్యాపారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, టీజీవోస్, టీఎస్జీవోస్ సంఘాల నాయకులు మంత్రి తుమ్మలను కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల పలు సంఘాల క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భగవంతుడు తనకు ఇచ్చిన శక్తి మేరకు ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందిస్తామన్నారు. కొత్త సంవత్సరంలో అన్ని వర్గాలు, కులాల ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ కలిసి మెలిసి అన్నదమ్ముల్లా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టే అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు నూతన సంవత్సరం కలిసి వస్తుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు శ్రీరామచంద్రుడి ఆశీస్సులు ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, నాయకులు పోటు ప్రసాద్, కార్పొరేటర్లు పాలేపు విజయవెంకటరమణ, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, పీఏసీఎస్ ఛైర్మన్లు రావూరి సైదుబాబు, తాతా రఘురాం, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, వెల్పుల వేలాద్రి, టీఎస్జీవోస్ నాయకులు గుంటుపల్లి శ్రీనివాసరావు, బుల్లెట్ శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన అధికారులు

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్, ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం ఏసీపీ రమణమూర్తి సబ్ డివిజన్‌లోని పోలీసు సీఐలతో కలిసి మంత్రి తుమ్మలను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. డీఎంహెచ్‌వో కళావతిబాయి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్, బ్రహ్మకుమారీలు కలిసి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

సమాజశ్రేయస్సు కోసమే పోలీసు యంత్రాంగం

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీపీ

ఖమ్మంక్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు యంత్రాగం చేసిన సమష్టి కృషి ఫలితమే నేటి సంతోషకర వాతావరణం అని, సమాజ శ్రేయస్సుకోసం పోలీసు యంత్రాంగం ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి బుధవారం ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా పలువురు సిబ్బంది నగరంలోని పోలీసు కమిషనర్ కార్యాలయానికి వచ్చి సీపీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, కుమారస్వామి, విజయబాబు, ట్రెయినీ ఐపీఎస్ అధికారి రుత్విక్, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రహమాన్, రఘు, శ్రీనివాసులు, రవి, సాంబరాజు, రవీందర్‌రెడ్డి, నరసయ్య, సుశీల్‌సింగ్ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన టీజీవో నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బుధవారం టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి తదితరులు కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్జీవో నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, కొణిదెన శ్రీనివాస్, గంగవరపు బాలకృష్ణ, దుర్గాప్రసాద్, జైపాల్, శ్రీధర్‌సింగ్, ఎర్రా రమేష్, ఆంజనేయులు, రాధాకృష్ణ, హరికృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



డప్పు కళాకారుల కళారూపం

శ్రమజీవుల సమస్యలను వెలుగెత్తిన అరుణోదయ

వైరా, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తాడిత, పీడిత, శ్రామిక జీవుల తరపున వారి సమస్యలపై అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వెలుగెత్తి చాటిందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు సీవై.పుల్లయ్య, ఆ సమాఖ్య జిల్లా కార్యదర్శి గడ్డం లక్ష్మణ్ పేర్కొన్నారు. వైరాలో మంగళవారం రాత్రి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల సభ, కళాకారుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974 మే 12న ఉస్మానియా యూనివర్సిటీలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఆనాటి నుంచి నేటివరకు పాటలు, ఆటలు, గజ్జల సవ్వళ్లతో అరుణోదయ సమాఖ్య ఉద్రూతలూగిస్తుందని, సాంస్కృతికోద్యమాన్ని నిర్వహిస్తుందని పేర్కొన్నారు. నాయకులు కె.అర్జున్‌రావు, టి.ఝాన్సీ, వి.వెంకటేష్, ఆవుల మంగతాయి, బండారు భద్రయ్య, కుదురుపాక దర్గయ్య, ఆరెంపుల వెంకన్న, నామా వీరభద్రం, బండారు భద్రయ్య, రాచబంటి రవి, కత్తుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక విడిది గృహాలను త్వరగా పూర్తి చేయాలి

భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



పరిశీలిస్తున్న కలెక్టర్, పీవో

భద్రాచలం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పర్యాటకుల విడిది గృహాలను అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భద్రాచలంలో ఆదివారం గోదావరి ఒడ్డున విడిది గృహాలను ఆయన పీవో రాహుల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రివర్ ఫెస్టివల్ 9న ప్రారంభిస్తున్నందున దానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఆరో తేదీలోపు పూర్తి చేయాలన్నారు. విడిది చేసే గృహాలలో గిరిజనుల సంప్రదాయ వంటకాలు మాత్రమే సరఫరా చేయాలని, వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా చూడాలన్నారు. కరకట్ట దగ్గర ఏర్పాటు చేసే స్టాల్స్‌లో గిరిజనులకు సంబంధించిన తేనె, కరక్కాయ పొడి, గిరిజనుల పాతకాలపు నగలు, వెదురు, వస్తువులు, కుమ్మరి, కమ్మరి వస్తువులు, సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు మహిళలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్‌రావు, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ వెంకటేశ్వర్, ఏసీఎంవో రమణయ్య, మిషన్ భగీరథ రాజారావు, ఏపీఎంలు జగదీష్, కిషోర్, జేడీఎం హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తుల సందడి



పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పాల్వంచ రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ జగన్నాథపురంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో బుధవారం భక్తులు భారీ సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. దేవస్థానం అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా సౌకర్యాలు కల్పించారు.

అదనపు కలెక్టర్ ప్రత్యేక పూజలు

అదనపు కలెక్టర్ వేణుగోపాల్ దంపతులతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వీరికి దేవస్థానం పండితులు, అర్చకులు ఆశీర్వచనంతోపాటు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందచేశారు. వీరి వెంట దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎన్.రజనీకుమారి తదితరులు ఉన్నారు.

నయాజోష్‌లో తగ్గిన 'కిక్'

(5వ పేజీ తరువాయి)

అమ్మకాల జోరు మాత్రం కాసింత తగ్గిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తగ్గిన మద్యం విక్రయాలు

నూతన సంవత్సర వేడుకలంటే ముందుగా అందరి చూపు మద్యం విక్రయాలపైనే ఉంటుంది. ఏటా నూతన సంవత్సర వేడుకల్లో మద్యం అమ్మకాలు భారీగా సాగుతాయి. కానీ ఈ సంవత్సరం మాత్రం మద్యం అమ్మకాల జోరు కాస్త తగ్గిందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఏపీలో మద్యం దుకాణాల నిర్వహణ సరిగా లేకపోవడంతో అక్కడి వారు సరిహద్దున ఉన్న ఉమ్మడి జిల్లాలో మద్యం కొనుగోళ్లు చేసేవారు. అయితే ఏపీలో కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వడంతో ఆ ప్రభావం ఉమ్మడి జిల్లాపై పడినట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 30శాతం వరకు మద్యం విక్రయాలు పడిపోయినట్టు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాలో 123, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 100 మద్యం దుకాణాలు ఉండగా ఆయా దుకాణాల్లో ప్రతీ రోజూ సగటున రూ.3.5లక్షల వరకు విక్రయాలు జరిగేవి. ఖమ్మం జిల్లాలో 38బార్లు, కొత్తగూడెం జిల్లాలో 12బార్లు ఉండగా కొత్త సంవత్సరం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.16కోట్ల మద్యం విక్రయాలు జరిగి ఉంటాయని అంచనా వేస్తున్నారు. అయితే ఏపీ ఎఫెక్ట్ పడకపోయి ఉంటే మరో రూ.కోటి వరకు విక్రయాలు జరిగే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విచ్చలవిడిగా కేకులు, బిర్యానీ పాయింట్‌లు

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఖమ్మం కార్పొరేషన్‌తో పాటుగా, మధిర, సత్తుపల్లి, వైరా వంటి ప్రధాన పట్టణాలు, కొత్తగూడెం జిల్లా కేంద్రంతోపాటు మిగిలిన పట్టణాల్లో సైతం వందల కొద్దీ కేకుల దుకాణాలు, బిర్యానీ పాయింట్లు ఏర్పాటు చేశారు. రోడ్లపైనే స్టాల్స్ ఏర్పాటు చేసి కేకుల విక్రయాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 300కు పైగా కేక్ దుకాణాలు ఏర్పాటు చేయగా ఆయా దుకాణాల్లో సగటున రూ.2లక్షల వరకు విక్రయాలు జరిగాయి. వాటితో పాటు రోజువారీగా కేక్ ఫ్యాక్టరీలు, స్వీటు దుకాణాల్లోనూ బయట ఏర్పాటు చేసిన దుకాణాల కంటే నాలుగింతల అమ్మకాలు జరిగాయని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. ఇక రోజూవారీ నిర్వహించే రెస్టారెంట్‌లు, బార్లు, దాబాల్లో బిర్యానీలకు భారీ ఆఫర్లు ప్రకటించగా విక్రయాలు కూడా భారీగానే జరిగినట్టు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.15కోట్ల వరకు బిర్యానీ విక్రయాలు జరిగినట్లు అంచనా.. ఇక ఇరు జిల్లాల్లో పెద్ద షాపింగ్‌మాల్స్ చిన్న వస్త్ర దుకాణాల్లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సుమారు రూ.60కోట్లు లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోంది. క్రిస్మస్ వేడుకల ఖర్చును సైతం లెక్కిస్తే వస్త్ర వ్యాపారం రూ.100కోట్లగానే సాగినట్టు తెలుస్తోంది.

మద్యం విక్రయాలు తగ్గాయి

గతంలో కంటే ఉమ్మడి జిల్లాలో ఈసారి మద్యం విక్రయాలు తగ్గాయి. ఏపీలో మద్యం దుకాణాలకు అనుమతులివ్వడంతో సరిహద్దుల్లో ఉన్న మద్యం దుకాణాలపై ఆ ప్రభావం ఎక్కువగా కనిపించింది. గతంలో జరిగిన విక్రయాలకంటే 20 నుంచి 30 శాతం వరకు కోత పడుతోంది. ఏపీ నుంచి జిల్లాకు వచ్చి మద్యం తాగేవారు పూర్తిగా తగ్గిపోయారు.

శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా వైన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ముగిసిన సీఎం కప్ ఆర్చరీ పోటీలు

విజేతలకు డీవైఎస్‌వో అభినందనలు



ఇండియన్‌రౌండ్ విజేతలను అభినందిస్తున్న ఖమ్మం డీవైఎస్‌వో, ఆర్చరీ సంఘం సభ్యులు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఆర్చరీ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో మొదటిరోజు ఇండియన్‌రౌండ్, రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో ఎలిమినేషన్ రౌండ్‌ను నిర్వహించగా బుధవారం తుది పోటీలు నిర్వహించారు. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో ప్రస్తుతం సంతాప దినాలు పాటిస్తున్న కారణంగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించలేదని డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి తెలిపారు. విజయం సాధించిన క్రీడాకారులకు తరువాత వారి జిల్లాలకు బహుమతులను పంపిస్తామని తెలిపారు.

విజేతలు వీరే..

- ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో లక్ష్మణ్(మహబూబాబాద్) ప్రథమ బహుమతి సాధించగా రవి(మహబూబ్‌నగర్) ద్వితీయ, రిత్విక్(ములుగు) తృతీయ బహుమతులు సాధించారు.
- ఇండియన్ రౌండ్ బాలికల విభాగంలో రఫీజా(వరంగల్) ప్రథమ బహుమతి సాధించగా రష్మిత(సిద్దిపేట) ద్వితీయ, శ్రవంతి (మేడ్చల్) తృతీయ బహుమతులు సాధించారు.
- కాంపౌండ్ బాలుర విభాగంలో రాహుల్(నిజామాబాద్) ప్రథమ బహుమతి సాధించగా శివసాయి(భద్రాద్రి కొత్తగూడెం) ద్వితీయ, సాయిసుశాంత్(మేడ్చల్)తృతీయ బహుమతులు సాధించారు.
- కాంపౌండ్ బాలికల విభాగంలో శ్రేష్టరెడ్డి(రంగారెడ్డి) ప్రథమ బహుమతి సాధించగా సుజాత(మహబూబ్‌నగర్) ద్వితీయ, మన్నూర హసీబన్(వరంగల్) తృతీయ బహుమతులు సాధించారు.
- రికర్వ్ బాలుర విభాగంలో అఖిల్(మహబూబాబాద్) ప్రథమ బహుమతి సాధించగా అచ్యుత్(వరంగల్) ద్వితీయ, హర్షవర్ధన్ (హైదరాబాద్) తృతీయ బహుమతులు సాధించారు.
- బాలికల విభాగంలో చిన్మయి(హైదరాబాద్) ప్రథమ బహుమతి సాధించగా లోహితశ్రీ(భద్రాద్రి) ద్వితీయ, సింధుజా(కామారెడ్డి) తృతీయ బహుమతులు సాధించారు.

సరిహద్దుల్లో కాయ్ రాజా కాయ్

(5వ పేజీ తరువాయి)

పందేలు నిర్వహిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్వాహకులకు ఎవరి మదతు ఉందనే విషయంపై పలువురు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. గత రెండు రోజులుగా జరిగిన పందేలకు సంబంధించి పెద్ద భరోసాతోనే పందేలు నిర్వహించినట్లు ప్రచారం జరుగుతోంది.

గతేడాది ఇలా..

ఏటా సంక్రాంతి సమయంలో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు మండలాలకు చెందిన వారితో పాటు సరిహద్దుల్లో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మండలాల వారు ఆంధ్రాలో జరిగే కోడి పందేలకు వెళ్లి ఆడుతూ ఉంటారు. కానీ గతేడాది సత్తుపల్లి మండలంలో కొందరు భారీ స్థాయిలో కోడి పందేలు నిర్వహించగా ఈ విషయం తెలిసిన ఒక మంత్రి జిల్లా పోలీసు అధికారులను హెచ్చరించటంతో అప్పట్లో పందేలు నిలిచిపోయాయి. కానీప్రస్తుతం మళ్లీ పందేలు, పేకాట రెండు రోజులుగా సత్తుపల్లి మండలంలో జరుగుతుండటం వెనుక ఎవరి హస్తం ఉందనే చర్చ సాగుతోంది.

అనుమతులు లేవు: సత్తుపల్లి సీఐ కిరణ్

పేకాట, కోడిపందేలు నిర్వహణకు, ఆడేందుకు ఎటువంటి అనుమతులు లేవు. పోలీస్ గస్తీ పటిష్టం చేస్తున్నాం.

రహదారులు రక్తసిక్తం

(5వ పేజీ తరువాయి)

గ్రామానికి చెందిన జడల కిరణ్ తన బైక్‌పై పెనుబల్లికి వచ్చి ఇంటికి వెళ్తుండగా తాళ్లపెంట గ్రామానికి చెందిన మిడియం అశోక్(35) బైక్‌పై పెనుబల్లికి వస్తుండగా వీరి బైక్‌లు పెనుబల్లి-గంగదేవిపాడు గ్రామాల మధ్య పిల్లవాగు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అశోక్‌ను ఖమ్మం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అశోక్ మృతికి కిరణే కారణమని, బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని బుధవారం బంధువులు అశోక్ మృతదేహన్ని కిరణ్ ఇంటికి తీసుకువెళ్లి ఆందోళన చేశారు. పలు గ్రామాలకు చెందిన సుమారు 500మంది ఆందోళనలో పాల్గొనడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పెనుబల్లి ఏఎస్ఐ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది కిరణ్ బంధువులతో చర్చించి ఆందోళన విరమింపజేశారు. ఈ ఘటనపై వీఎంబంజర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూసుమంచి మండలంలో బుధవారం తెల్లవారుజామున బైక్ పల్టీకొట్టిన ఘటనలో బైక్ మెకానిక్ దుర్మరణం చెందాడు. పెరికశింగారం గ్రామానికి చెందిన షేక్ జాన్‌పాష(32) తన షెడ్‌లో పనిచేస్తున్న రాము అనే వ్యక్తిని మంగళవారం అర్ధరాత్రి తన బైక్‌పై చేగొమ్మలో డ్రాప్ చేసి కూసుమంచి వైపు వస్తుండగా చింతలతండ కార్నర్ వద్ద అతివేగంగా వచ్చి అదుపుతప్పి పల్టీ కొట్టాడు. దీంతో జాన్‌పాష అక్కడికక్కడే చెందాడు. కూసుమంచి పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి తరలించి మృతుడి భార్య షేక్ ఫరీదా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రాద్రి జిల్లా మణుగూరులోని ప్రధాన రహదారిపై జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మణుగూరులోని అశోక్ నగర్ ప్రాంతానికి చెందిన వీర్రాజు తాపీమేస్త్రీ పనిచేస్తుంటాడు. బుధవారం సాయంత్రం సైకిల్‌పై వెళుతుండగా మణుగురు ప్రధాన రహదారిలో పెట్రోల్‌బంక్ సమీపంలో ఓ లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీర్రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. వీర్రాజు కుమారుడు వెంకట్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అశ్వారావుపేట మండలంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇంటర్ విద్యార్థి మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని గాండ్లగూడెం గ్రామానికి చెందిన వాంకుడోతు నాగచైతన్య(17) అశ్వారావుపేటలో ఇంటర్ చదువుతున్నాడు. గ్రామానికి చెందిన గుగులోతు రుషీంద్రతో కలిసి నాగచైతన్య బుధవారం మధ్యాహ్నం బైక్‌పై బచ్చువారిగూడెం వైపునకు వెళుతుండగా ఇదే సమయంలో బచ్చువారిగూడెం వైపు నుంచి వచ్చిన మరో బైక్ వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో నాగచైతన్య అక్కడిక్కడే మృతిచెందాడు. మరో యువకుడు రుషీంద్రకు తీవ్రంగా గాయాలు కాగా ఖమ్మం తరలించారు. మరో బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలు కాగా అతడిని అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించారు. ఇతడి వివరాలు తెలియరాలేదు. అశ్వారావుపేట పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారు

ఖమ్మంటౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అందులో భాగంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, జెడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్ తదితరులతో కలిసి కేక్ కట్‌చేశారు. మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మమత ఆస్పత్రి ప్రాంగణంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యేలు బాణాత్ చంద్రావతి, బాణోత్ మదన్‌లాల్, డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషయ్య, ఏఎంసీ మాజీచైర్మన్ గుండాల కృష్ణ తదితరులతో కలిసి కేక్ కట్‌చేశారు. ఆయా కార్యక్రమాల్లో తాతా మధుసూదన్, పువ్వాడ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది కాలంలో వారు చేసింది ఏమీ లేదన్నారు. రైతులు, మహిళలతో సహా అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ప్రజాపాలనపై నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ప్రకటించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ సంవత్సరం జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ అఖండ విజయం సాధిస్తుందన్నారు.

పామాయిల్ రైతులకు శుభవార్త

- రూ.20,506కు పెరిగిన టన్ను గెలల ధర

అశ్వారావుపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో పామాయిల్ రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పామాయిల్ గెలల ధర టన్ను రూ.20,506 నిర్ధారించారు. గత నెలలో టన్ను గెలల ధర రూ.20,413ఉండగా జనవరిలో మరో రూ.83 పెరిగి టన్ను ధర రూ.20,506లుగా నిర్ధారించారు. ఈ ధర తక్షణమే అమలులోకి వస్తుందని ఆయిల్‌ఫెడ్ అధికారులు తెలిపారు. గత ఏడు నెలలుగా పామాయిల్ ధర భారీగా పెరుగుతూనే ఉంది. ఏడు నెలల్లోనే టన్నుకు రూ.8వేలకు పైగా ధర పెరిగింది. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచడం, ఓఈఆర్ శాతం పెంచేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలు వంటివి ఈ ధర పెరుగుదలకు కారణాలుగా చెప్పవచ్చు. పామాయిల్ గెలల ధర పెరుగుదలతో సుమారు 7వేల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. పామాయిల్ గెలల ధర పెంపుపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు హర్షం వ్యక్తం చేశారు. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలోని తుమ్మల స్వగృహంలో బుధవారం కొందరు పామాయిల్ రైతులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పామాయిల్ గెలల ధర పెరిగిన విషయాన్ని మంత్రి తుమ్మల సదరు రైతులకు తెలిపారు. దాంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో..
నూతన సంవత్సర వేడుకలు



మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మువ్వా, తుళ్లూరి బ్రహ్మయ్య

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తుంబూరి దయాకర్‌రెడ్డి నూతన సంవత్సర కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులకు తినిపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో రాష్ట్ర ఇరిగేషన్ ఛైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఎమ్మెల్యే కోరం కనకయ్య, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య మంత్రి శ్రీనివాసరెడ్డిని కలిసి సన్మానించారు.







నగరంపై మంచు దుప్పటి

బుధవారం ఉదయం ఖమ్మం నగరాన్ని పొగమంచు కమ్మేసింది. ఉదయం 8గంటలు దాటిన తరువాత కూడా మంచు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పగటి పూట ఉష్ణోగ్రత ఉన్నప్పటికీ, ఉదయం మంచు కురిసింది.. మంచుతెరలతో, వాహనాల లైట్ల వెలుతురుతో నగరం సోయగాన్ని సంతరించుకుంది.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



సేవలకు 'బంక్'

ఉచితంగా గాలి నింపాల్సిందే



వాహన టైర్లలో గాలి నింపడానికి, గాలి. శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఓ వ్యక్తిని అందుబాటులో ఉంచాలి. బంకులో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి.

ప్రథమ చికిత్స కిట్‌లో ఉంచాల్సిందే



ప్రథమ చికిత్స కిట్ సౌకర్యం ప్రతీ బంకు వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలు ఉంటుంది. మీ డిమాండ్ పై బంకు యజమానులు ప్రథమ చికిత్స ఇవ్వడానికి నిరాకరిస్తే లిఖిత పూర్వకంగా చేయవచ్చు.

- పెట్రోల్ బంకుల్లో సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం
- సాకులు చెబుతున్న నిర్వాహకులు
- మన హక్కు కోసం అడగాల్సిందే..
- పట్టించుకోకుంటే ఫిర్యాదు చేయాల్సిందే..

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం పెట్రోల్ బంకులకు వెళ్తారు. కొందరేమో సుదూర ప్రాంతాల నుంచి వస్తుండటంతో బంకుల్లో కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. కానీ చాలాచోట్ల బంకు నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. సౌకర్యాల గురించి అడిగితే యంత్రాలు పనిచేయడం లేదని సాకులు చెబుతారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల వద్ద కల్పించాల్సిన సౌకర్యాలు ఏమిటి, నిబంధనలు పాటించకపోతే ఎవరిని సంప్రదించాలో 'ఆంధ్రజ్యోతి' కథనం ఇది..

ఫిర్యాదులకు ఇలా సంప్రదించాలి

పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు అందించాల్సిన సౌకర్యాలను నిర్వాహకులు విస్మరిస్తే సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్ (హెచ్‌టీటీపీఎస్ పీజీపీఓ ఆర్టీఎల్.జీఓవి.ఇన్) ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. బంకులో ఉన్న రిజిస్టరులో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చు. చమురు సంస్థ సేల్స్ మేనేజర్ పేరు, చరవాణి నంబర్లకు, ఇవన్నీ అందుబాటులో లేకుంటే తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చు.



మూత్రశాల, మరుగుదొడ్డి అందుబాటులో...

స్వచ్ఛభారత్లో భాగంగా అన్ని పెట్రోలు, డీజిల్ బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉంచాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలున్నాయి. పలుచోట్ల వీటిని ఏర్పాటు చేసినా వినియోగించేందుకు నిర్వాహకులు అనుమతులు ఇవ్వడం లేదు. లీటరు పెట్రోలు లేదా డీజిల్ కొనుగోలు చేస్తే అందులో మనం బంక్‌లకు రూ.4 నుంచి రూ.6 పైసలు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు చెల్లిస్తున్నామని గుర్తించండి.



ఉమ్మడి జిల్లాలో వివరాలు ఇలా..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మొత్తం 173 పెట్రోలు బంకులు ఉన్నాయి. వీటిలో రోజుకు 5.25లక్షల లీటర్ల పెట్రోలు, 13.50 లక్షల లీటర్ల డీజిల్ విక్రయాలు జరుగుతుంటా యి. ఒక్కో బంకుకు రోజు వారీగా పట్టణాల్లో 500 వాహనాలు, గ్రామాల్లో 200- 300 వాహనాలు వస్తుంటాయి.

- పెట్రోలు పంపుల వద్ద స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలి. దీనికోసం డీలర్లు పంపు యంత్రం, వాటర్ కూలర్, వాటర్ కనెక్షన్ అందుబాటులో ఉంచాలి.
- పెట్రోలు, డీజిల్ నాణ్యత, పరిమాణాన్ని తెలుసుకునేందుకు ఫిల్టర్ పేపర్లు అందుబాటులో ఉంచాలి. లీటరుకు పెట్రోలు తక్కువగా వస్తుందని అనుమానం వచ్చినా వెంటనే పరీక్షించుకోవచ్చు.
- అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు సెల్‌ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాలి. పెట్రోల్ బంకును సందర్శించి మీరు ఏ నెంబరు కు అయినా కాల్స్ చేసుకోవచ్చు.
- పెట్రోలు, డీజిల్‌కు సంబంధించిన బిల్లులు వినియోగదారులు పొందవచ్చు. ఇందుకు యజమానులు నిరాకరిస్తే అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.
- బంకుల్లో సంస్థ, యజమాని పేరు, సంప్రదింపుల ఫోన్ నెంబర్లు కచ్చితంగా అందరికి కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలి.

కోడి పందాలు, పేకాటపై ఉక్కుపాదం

- స్థావరాలపై దాడులు చేసిన పోలీసులు
- పలువురి అరెస్టు, నగదు, ద్విచక్ర వాహనాల స్వాధీనం

ఎర్రుపాలెం/ అన్నపురెడ్డిపల్లి/ దమ్మపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కోడి పందాలు, పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. ఎర్రుపాలెం, అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట మండలాలల్లో జూదం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. నగదు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఎర్రుపాలెం మండంలోని గుంటుపల్లి గోపవరం గ్రామంలో గల



ఎర్రుపాలెంలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

తెలంగాణ క్రీడాప్రాంగణలో కోడిపందాల స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఎర్రుపాలెం ఎస్‌ఐ పి.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటుపల్లి గోపవరం గ్రామంలో గ్రామీణ క్రీడాకారుల కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన తెలంగాణ క్రీడా మైదానంలో కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం మేరకు పందేల స్థావరంపై దాడిచేసినట్టు తెలిపారు. ఈదాడిలో గ్రామానికి చెందిన పది మంది జూదగాళ్లను, రెండు కోడి పుంజులను, రూ.4200 నగదు, మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

అన్నపురెడ్డిపల్లి మండలంలో పేకాట, కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై బుధవారం అన్నపురెడ్డిపల్లి పోలీసులు దాడులు నిర్వహించి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వేరు వేరుగా జరిగిన దాడులపై ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కట్టుగూడెం శివారు పల్లెప్రకృతి వనంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు స్థావరంపైదాడి చేయగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ 1500లు, పేకలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బూరుగూడెం గ్రామ శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొగా మరికొందరు పరారయ్యారు. పట్టుబడ్డ వారి వద్ద నుంచి రూ 2700, 1 బైక్, రెండు కత్తులు, నాలుగు పుంజులు స్వాధీనం చేసుకొని, పట్టుబడ్డ వారిపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.



అన్నపురెడ్డిపల్లిలో పేకాట, కోడిపందేలు నిర్వహిస్తూ పట్టుబడ్డ నిందితులు

దమ్మపేట మండలంలోని నెమిలిపేటలో పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. నెమిలిపేట గ్రామ సమీపంలో తోటలో పేకాట ఆడుతుండగా సమాచారం మేరకు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈఘటనలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్దనుంచి రూ.10,500 లు నగదు, మూడు ద్విచక్రవాహనాలు పేకముక్కలు స్వాదీనం చేసుకున్నారు. ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'భూభారతి'లో భూముల సమస్యలు
శాశ్వతంగా పరిష్కరించాలి

- తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు

ఖమ్మంటౌన్, జనవరి1 (ఆంధ్రజ్యోతి): నూతన రెవెన్యూ చట్టం భూభారతిలో భూసమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. బుధవారం నగరంలోని ఎన్నెస్పీ క్యాంప్‌లోని మంచికంటి మీటింగ్‌హాల్‌లో తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న ధరణి పోర్టల్‌కంటే భూభారతి మెరుగైన చట్టంగా రూపొందించామని చెబుతున్నప్పటికీ మొత్తం భూసమస్యలు పరిష్కారం కావన్నారు. భూభారతి ఆర్‌వోఆర్ 2024లో 23 సెక్షన్లు రూపొందించారని, జాగీర్, ఇనామ్‌లలో రద్దు చేసిన భూములను నూతనచట్టం ప్రకారం ప్రభుత్వ భూములుగా గుర్తిస్తే పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. పేదలు సదరు భూములను దీర్ఘకాలంగా సాగుచేస్తున్నారని, ప్రభుత్వభూముల ఆలోచన విరమించుకొని, అర్హులైన వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి వై. ప్రకాష్, అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాల్లో అగ్రస్థానంలో ఖమ్మం

- పార్లమెంట్ కమిటీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం



టీడీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో తెలంగాణలోనే ఖమ్మంలో అధిక సంఖ్యలో సభ్యతాలు నమోదయ్యాయని పార్లమెంట్ కమిటీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అన్నారు. తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు కేతినేని హరీష్ ఆధ్వర్యంలో పార్లమెంట్ కమిటీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసినివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ తెలంగాణ రాజకీయాల్లో బలమైన శక్తిగా పార్టీని నిలబెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు, రాజరాజేశ్వరి, మందపల్లి రజిని, సత్యనారాయణ, మంద వెంకటనారాయణ, మార్నిడు పుల్లారావు, నల్లమల రంజిత్, మందపల్లి కోటి, చంద్ర రవి, పాలడు కృష్ణ ప్రసాద్, కామ అనిత, కోనేరు రాణి, నాగండ్ల లక్ష్మణ్, చావా రామారావు, మీగడ రామారావు, చింతనిప్పు నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ మునిసిపల్ కమిషనర్ కన్నుమూత


కొత్తగూడెం టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌గా పని చేసి పదవీ విరమణ చేసిన రాజేశ్వరరావు బుధవారం గుండెపోటుతో హైదరాబాద్‌లో మృతి చెందారు. కొత్తగూడెం పట్టణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. మున్సిపల్ అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన రాజేశ్వరరావు కొత్తగూడెం మున్సిపల్ అభివృద్ధి కోసం గత 10 సంవత్సరాల క్రితం రూ. 2కోట్ల నిధులను మంజూరుచేయించారు. రాజేశ్వరరావు అకాల మృతి పట్ల ప్రముఖ వైద్యులు కోటేశ్వరరావు, గడిపల్లి కనక రాజు, బీఎస్ఎన్ఎల్ అధికారి రాంచందర్‌రావు, న్యాయవాది రమేష్‌కుమార్ మక్కడ్‌తోపాటు కొత్తగూడెం పట్టణానికి చెందిన వ్యాపారులు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సంతాపం ప్రకటించారు.



రాజేశ్వరరావు (ఫైల్)

మాంజా దారం తగిలి వ్యక్తికి గాయాలు

చుంచుపల్లి, జనవరి01(ఆంధ్రజ్యోతి): గాలిపటానికి కట్టిన మాంజా దారం గొంతుకు తగిలి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలై రక్తస్రావం జరిగిన సంఘటన బుధవారం కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రుగొండ మండలానికి చెందిన నలభై సంవత్సరాల వయస్సు కలిగిన ఏరువా కృష్ణరావు అనే వ్యక్తి కొత్తగూడెం పట్టణంలో ఓ ప్రైవేటు మిల్క్ కంపెనీలో విధులు నిర్వహిస్తూ బూడిదగడ్డ ప్రాంతంలో నివసిస్తున్నారు. నూతన సంవత్సర సందర్భంగా సొంతూరు చంద్రుగొండకి వెళ్లి తన ద్విచక్రవాహనంపై తిరిగి కొత్తగూడెం వస్తున్నాడు. ఈ క్రమంలో రామవరం బస్టాండ్ ప్రాంతం దాటగానే రోడ్డుపై వేలాడుతున్న గాలిపటానికి ఉన్న మాంజా దారం అకస్మాత్తుగా గొంతుకు తగిలింది. వెంటనే కృష్ణరావు తన వాహనాన్ని ఆపివేశాడు. అప్పటికే మాంజా దారం పదును వల్ల గొంతు భాగంలో గాయాలై తీవ్రంగా రక్తస్రావం అయింది. ఇది గమనించిన స్థానికులు బాధితుడిని తగిన జాగ్రత్తలతో కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)కి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు, మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు.



గాయపడిన కృష్ణరావు

వివాహం కావడం లేదని యువకుడి ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, వివాహం కావటంలేదనే మనోవేదనతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన బొడ్డపాటి లక్ష్మి పెద్ద కుమారుడు ఉపేంద్ర(25) సత్తుపల్లిలోని ఓపాఠశాలకు చెందిన బస్సుకు సహాయకుడిగా పనిచేస్తున్నాడు. అయితే ఉపేంద్ర తండ్రి చిన్నతనంలోనే చనిపోవటం, తమ్ముడు రెండేళ్ల క్రితం వివాహం చేసుకుని బయటకు వెళ్లటంతో కుటుంబభారాన్ని మోస్తున్నాడు. తమ్ముడికి వివాహం కావటం తనకు పెళ్లికాకపోవటంతో మనోవేదన చెందుతున్నాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు నెలకొనటంతో బుధవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు ఇళ్లల్లో చోరీ

పెనుబల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెనుబల్లి బీసీ కాలనీలో మంగళవారం రాత్రి రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి నగదు, బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బీసీ కాలనీకి చెందిన తేజావత్ రాము ఇటీవల మృతిచెందగా అతని భార్య లక్ష్మి ఇంట్లో లేదు. ఈ సమయంలో లక్ష్మి ఇంటి తాళం పగులగొట్టి బంగారు నాంతాడు ఇతర వస్తువులు కలిపి రూ.2లక్షలు చోరీ చేశారు. దీంతోపాటు భూక్యా మురళి ఇంటి తాళాలు పగులగొట్టి రూ.38వేల నగదును దోచుకెళ్లారు. చర్చి ఫాదర్ రాకడ రాజా ఇంట్లో సెల్‌ఫోన్ చోరీకి గురైంది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్‌ఐ ఎం.సత్యనారాయణ సంఘటనాస్థలాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు



'గ్రామాభివృద్ధికి సహకరించాలి'

తిరుమలాయపాలెం, జనవరి1 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామసహాయం అరవిందరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని బచ్చోడులో వారాంతపు సంతను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బచ్చోడు గ్రామంలో సంత ఏర్పాటుతో గ్రామం అభివృద్ధి చెందుతుందని చుట్టుపక్కల గ్రామాలప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. చిరువ్యాపారులకు కూడా ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వి.మల్లికార్జున్, మల్లయ్య, వెంకయ్య, టి.హనుమంతరావు,యాదగిరి, అనంతచారి, జి.రమేస్, వీరస్వామి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	20రూ.
వంకాయ	28
గుత్తి వంకాయ	40
బీరకాయ	48
పచ్చిమిర్చి	38
కాకరకాయ	54
బెండకాయ	34
పొట్లకాయ	50
దోసకాయ	34-38
నాటుచిక్కుడు	68
గోరుచిక్కుడు	38
క్యాబేజీ	24
దొండ	54-60
సొరకాయ	28
క్యారెట్	48
క్యాప్సికం	68
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	180
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	మ్యాక్స్
సాయిరాం:	డ్రింకర్‌సాయి/యూఐ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

ఘనంగా 'నూతన' వేడుకలు

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నెట్‌వర్క్: నూతన సంవత్సర వేడుకలు ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకున్నారు. పాతసంవత్సరానికి వీడ్కోలు పలుకుతూకొత్తసంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా బాణాసంచా వెలుగులు.. కేక్ కటింగ్‌లు.. స్వీట్స్ తినిపించుకోవడం పరస్పరం ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకోవడం వంటి నచ్చినరీతిలో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. మహిళలు ఇళ్ల ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు అద్దారు నూతన సంవత్సరం పురస్కరించుకుని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. తిరుమలాయపాలెం మండలంలో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



కూసుమంచి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఖమ్మం గుట్ట ఆలయంలో భక్తుల పూజలు



కామేపల్లి మండలం కొత్తలింగాల కోటమైసమ్మ ఆలయంలో పూజలు





ఖమ్మం నరసింహస్వామి గుట్ట ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఖమ్మంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర నివాసంలో..



తిరుమలాయపాలెం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



కేక్ కట్‌చేస్తున్న పాస్టర్

పేదల పక్షాన సీపీఐ నిరంతర పోరాటం



మాట్లాడుతున్న హేమంతరావు

మధిర రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల పక్షాన సీపీఐ పార్టీ నిరంతర పో రాటాలు కొనసాగిస్తూనే ఉంటుందని ఆపార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. బుధవారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లిలో జరిగిన సీపీఐ శతవసంతాల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, ఆసమస్యలు పరిష్కారమయ్యేంతవరకు తమ పోరాటాలు ఆగవన్నారు. ప్రజలకు అండగా ఉండేది సీపీఐ పార్టీ ఒక్కటేనన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటాలు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జితేందర్‌రెడ్డి, మందడపు రాణి, బెజవాడ రవిబాబు, వూట్ల కొండల్‌రావు, ప్రకాశరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో బీమా కోరేగావ్ విజయోత్సవ వేడుకలు

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి1 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం నగరంలోని జడ్పీసెంటర్‌లో బీమా కోరేగావ్ విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి ఖమ్మంజిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం మాట్లాడుతూ 1818లో మహారాష్ట్రలో మహార్ సైన్యం నాటి పీష్వా సైన్యంపై యుద్ధం చేసి ఆసైన్యాన్ని ఓడించి చత్రపతి శివాజీకి పంపిన చరిత్ర మహార్ సైన్యాలకు ఉందన్నారు. మహార్ సైన్యం అంటే యుద్ధ వీరులని, మాలలు అంటేనే ప్రాణాలను లెక్కచేయకుండా చిత్తశుద్ధితో పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడుజిల్లా అధ్యక్షుడు కొట్టే సుధాకర్, గౌరవ సలహాదారుల లింగాల రవికుమార్, ప్రధాన కార్యదర్శి గుమ్మడి కనకరాజు, వరద నర్సింహారావు, కొరివి దయానంద్, పేరం మల్లయ్య, దామల్ల వెంకటేశ్వర్లు,తలారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ భవనం ప్రారంభం

నేలకొండపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజేశ్వరపురం సొసైటీలో రూ.21.60లక్షల వ్యయంతో నిర్మించిన భవనాన్ని సంఘ అధ్యక్షుడు తన్నీరు కృష్ణమూర్తి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అడపాల రవీందర్, డైరెక్టర్‌లు దండా రంగయ్య, బోనగిరి కిరణ్, దండా నరేష్, బానోత్ నాగేశ్వరరావు, పుసులూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' ప్రభుత్వంలో ఇంటింటికి సంక్షేమ పథకాలు

44వ డివిజన్‌లో క్యాలెండర్ ఆవిష్కరించిన మేయర్ పునుకొల్లు నీరజ



44వ డివిజన్‌లో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ నీరజ, కార్పొరేటర్ విజయవెంకటరమణ

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఖమ్మం నియోజకవర్గంలో ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం 44వ డివిజన్‌లో కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మేయర్ ప్రారంభించారు. కుల మతాలకు అతీతంగా 44వ డివిజన్‌లో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు జరుగుతున్నాయని, అన్ని వర్గాల ప్రజలకు కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ ఆర్థికంగా సహాయం అందిస్తున్నారని అభినందించారు. డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఖమ్మం రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కామంచికల్ గ్రామానికి చెందిన నువ్వుల కృష్ణయ్యకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సిఫారస్సుతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. రూ.82 వేల చెక్కును బాధిత కుటుంబానికి బుధవారం సీపీఎం నాయకులు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సెక్రటరీ బషీర్, మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, రఘునాథపాలెం మండలం, సీపీఎం మండల కార్యదర్శి నవీన్ రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

14న 'మంచుకొండ ఎత్తిపోతల'కు మంత్రులు తుమ్మల, ఉత్తమ్ శంకుస్థాపన



ఏఎంసీ మాజీ చైర్మన్ రాధాకిషోర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

రఘునాథపాలెం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మంచుకొండలో 'మంచుకొండ ఎత్తిపోతల' పథకానికి ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 14న శంకుస్థాపన చేస్తారని ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ పేర్కొన్నారు. ఎత్తిపోతల పథకంతో 33 చెరువులకు సాగునీరు అంది రఘునాథపాలెం మండలం సుభిక్షంగా మారుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని బుధవారం కాంగ్రెస్ నాయకులతో మానుకొండ రాధాకిషోర్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోనే మోడల్ మండలంగా రఘునాథపాలెం మారుతుందని ఇప్పటికే మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో ఇంటిగ్రేటెడ్ సంక్షేమ గురుకులం, స్వామినారాయణ పాఠశాల, రాష్ట్ర గిడ్డంగులు, ఇస్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం జరుగుతుందని, జాతీయ రహదారులకు అనుకూలంగా మండలంలో రవాణా మార్గం మార్పులు చేశారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రూ.500 కోట్ల అభివృద్ధి పనులు చేశారని వివరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ బలపర్చాల్సిన అవశ్యకతపై ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. మాజీ సర్పంచులు, నాయకులు వాంకుడోత్ దీప్లానాయక్, గోరీలాల్, బీమానాయక్, దుంపటి నగేశ్, భూక్య చిన్నయ్య, చల్లగుండ్ల శ్రీనివాసరావు, అరివికట్ల సుదీర్, బండి నాగేశ్వరరావు, మాధంశెట్టి హనుమంతరావు, షేక్ ఆరీఫ్, నరేశ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలి



బాధితుడిని పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంటౌన్, జనవరి1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముస్తఫానగర్‌లో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో భారీగా నష్టపోయిన టెంట్ హౌస్ నిర్వాహకుడు జువాజి శ్రీనివాసరావును ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పూర్తిగా కాలిపోయిన టెంట్‌హౌజ్‌ను నున్నా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సీపీఎం ప్రతినిధి బృందం బుధవారం సందర్శించి, బాధితుడినుంచి వివరాలు తెలుసుకున్నారు. నున్నా మాట్లాడుతూ టెంట్ హౌస్‌లో ఉన్న సామగ్రి మొత్తం కాలిపోయి సుమారు రూ.కోటిన్నరకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, కలెక్టర్ మానవతా దృక్పధంతో శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు ఎంఏ జబ్బార్,ఎస్‌కే.నాగుల్‌మీరా, అంబడిపూడి సుధాకర్, సత్తార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కేఎంసీలో ఇద్దరు ఉద్యోగులపై వేటు

ఖమ్మం సంక్షేమవిభాగం జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరపాలక సంస్థ పరిపాలనలో అధికారులకు తలనొప్పిగా మారిన రెండు ప్రధానమైన వర్గాల ఉద్యోగులపై కమిషనర్ అభిషేక్ అగస్త్య తనదైన రీతిలో వరసగా వేటు వేశారు. కేఎంసీలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులను ఖమ్మం నగరపాలకసంస్థ నుంచి ఇతర మునిసిపాలిటీలకు బదిలీ చేశారు. ఖమ్మం నగరపాలక సంస్థలో ఆర్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాసరావును ఇటీవల మరిపెడ బంగ్లా మునిసిపాలిటీకి బదిలీచేశారు. బుధవారం ఖమ్మం కేఎంసీలో ఉన్న మరో ఆర్ఐ సుధాకర్ డిప్యూటేషన్‌ను రద్దుచేసి మహబూబాబాద్‌కు పంపుతూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ ఇద్దరు ఉద్యోగులు కొంతకాలంగా ఖమ్మం నగరపాలక సంస్థలోని అంతర్గత విషయాలను బయటకు పంపుతూ పరిపాలనలో ఇబ్బందులను సృష్టించడంతో వరుసగా వేటు వేసినట్లు చర్చ జరుగుతుంది.

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

ఖమ్మం ఖానాపురం హవేలి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను మంత్రి తుమ్మల బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దొడ్డా వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి షేక్ ఖరామత్ అలీ, జమాల్, నరేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ లేబర్ కమిషనర్

కార్పెంటర్స్ అసోసియేషన్ క్యాలెండర్..

ఖమ్మంచర్చికాంపౌండ్ (ఆంధ్రజ్యోతి): కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. బుధవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఖమ్మం డిప్యుటీ లేబర్ కమిషనర్ కె.విజయభాస్కరరెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్పెంటర్లుగా పనిచేసే ప్రతి ఒక్కరు లేబర్‌కార్డులు కలిగి ఉండాలని సూచించారు. లేబర్‌కార్డు ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. లేబర్‌కార్డును దళారులు ద్వారా తీసుకుని మోసపోవద్దన్నారు. ఈకార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ, కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాణాల వీరబ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజుకుమార్, కోశాధికారి తాటికొండ రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్..

కామేపల్లి(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయు డైరీ, క్యాలెండర్‌ను మండల విద్యాశాఖాధికారి జీ. వెంకట్, మండల అధ్యక్షుడు పిట్టల రాములు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టి.వెంకన్న, గౌరవ అధ్యక్షులు జైబా, మండల ఉపాధ్యక్షులు మురళీధర్‌రెడ్డి, శశి కళాధర్, బాలాజీ, హరిప్రసాద్, వెంకన్న, స్వతనానాయణ, రామయ్య, మాలిక తదితరులు పాల్గొన్నారు.

సన్నాల బోనస్ 'ఆలస్యం'

» నెలరోజులైనా అందని బోనస్ » ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

వైరా, జనవరి1 (ఆంధ్రజ్యోతి): సన్నరకం ధాన్యానికి రూ.500బోనస్ విషయంలో తీవ్ర ఆలస్యం జరుగుతుంది. రూ.రెండు లక్షల రుణ మాఫీ, రైతు భరోసా మాదిరిగానే సన్నాలకు రూ.500బోనస్ చెల్లింపు ప్రక్రియ ఒక ప్రవాసనంగా రైతులు అసంతృప్తి వెలిబుచ్చుతున్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రారంభంలో సన్నరకం ధాన్యానికి అసలు సొమ్ముతో పాటు రూ.500బోనస్‌ను కూడా రెండు, మూడు రోజుల వ్యవధిలోనే రైతుల బ్యాంకు ఖాతాల్లోనే జమచేశారు. అయితే నిధుల కొరతో లేక ఏకారణమో తెలియదు కానీ నెలరోజుల నుంచి ధాన్యం అసలు సొమ్ము సహా బోనస్ డబ్బులు కూడా అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమకావడం లేదు.



ధాన్యం ఆరబోస్తున్న దృశ్యం(ఫైల్)

96మంది రైతులకు అందని బోనస్..

గరికపాడు సొసైటీలో ఇప్పటివరకు 492 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయగా 96మంది రైతులకు బోనస్ సొమ్ము రాలేదు. 50మంది రైతులకు అసలు ధాన్యం సొమ్ము కూడా ఖాతాల్లో జమకాలేదు. తీరా పూసలపాడు సొసైటీ పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో, డీసీఎంఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన పలువురు రైతులకు అసలుతోపాటు బోనస్ సొమ్ము కూడా ఆలస్యమవుతుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ, రైతు భరోసా మాదిరిగానే ధాన్యం బోనస్ చెల్లింపుల్లో కూడా జాప్యం చేయవద్దని వెంటనే చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

15రోజులు దాటినా బోనస్ రాలేదు

- బట్టా పెద్దభద్రయ్య, రైతు, తాటిపూడి



నెలరోజులు దాటినా అసలు, బోనస్ జమకాలేదు. తాను 15రోజుల కిందట 85క్వింటాళ్ల సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేం ద్రంలో విక్రయించాను. ఇంతవరకు ధాన్యం అసలు సొమ్ము, అలాగే క్వింటాకు రూ.500చొప్పున బోనస్ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమకాలేదు. రెండు, మూడురోజులకే అసలు, బోనస్ సొమ్ము జమ అవుతుందని అధికారులు చెప్పినా ఆచరణలో తీవ్ర జాప్యం జరుగుతుంది.

నెలదాటినా అతీగతీ లేదు

- శీలం ఆదినారాయణరెడ్డి, రైతు, గరికపాడు



నవంబరు నెల చివర్లో 125క్వింటాళ్ల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. సొసైటీ సిబ్బంది ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంతవరకు 125క్వింటాళ్ల ధాన్యం సొమ్ము వాటికి సంబంధించిన రూ.500బోనస్ బ్యాంకు ఖాతాలో జమకాలేదు. అసలు, బోనస్ డబ్బులు ఎప్పుడొస్తాయో సంబంధిత సిబ్బంది సమాధానం చెప్పలేకపోతున్నారు. వెంటనే ధాన్యంతోపాటు బోనస్ డబ్బులు చెల్లించాలి.

వెంటనే బోనస్ చెల్లించాలి

- రాయల రమేష్, రైతు, రెబ్బవరం



12రోజుల కిందట ధాన్యాన్ని విక్రయించాను. ఇంతవరకు రూ.500బోనస్ ఇవ్వలేదు. ధాన్యం అసలుతో పాటు బోనస్ డబ్బు లు కూడా రెండు,మూడురోజుల్లోనే చెల్లిస్తున్నామని అధికారులు చేస్తున్న ప్రకటన ఆచరణలో అమలుకావడం లేదు. బోనస్ డబ్బులు చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలి. వెంటనే ఆసొమ్ము చెల్లించాలి.

మంత్రి తుమ్మలను కలిసిన నాయకులు



మంత్రి తుమ్మలకు శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ నాయకులు

సత్తుపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సత్తుపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను కలుసుకున్నారు. కాకర్లపల్లి రోడ్డులోని చల్లగుళ్ల నరసింహారావు ఇంటి వద్ద కాంగ్రెస్ నాయకులు మంత్రి తుమ్మలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు కూడా తుమ్మలకు పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి పొంగులేటిని కలిసిన బొర్రా రాజా



మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బొర్రా రాజశేఖర్

వైరా, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డిని బుధవారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్‌రెడ్డి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో బొర్రా వారిని కలిసి బొకే అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. వైరా నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితుల గురించి బొర్రాను మంత్రి, ఎంపీ అడిగి తెలుసుకున్నారు.

సత్తుపల్లి అభివృద్ధికి అందరూ సహకరించాలి

» ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జనవరి1 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని వర్గాల వారు సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌లు కోరారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడుతూ గతేడాది ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పటికీ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుందని, కొత్త సంవత్సరంలో కూడా మరింత అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. స త్తుపల్లిలో వంద పడకల ఆసుపత్రి ప్రారం భం, పాలిటెక్నిక్ కాలేజీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాల, కళాశాల ఏర్పాటు, న ర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణం ఇన్‌డోర్, అవుట్ డోర్ స్టేడియంల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. గతంలో ఆగిపోయిన పథకాలకు నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకు లు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే రాగమయికి పలువురు ఉద్యోగులు కాంగ్రెస్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పేదల పక్షాన సీపీఐ నిరంతర పోరాటం

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

మధిర రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల పక్షాన సీపీఐ పార్టీ నిరంతర పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటుందని ఆపార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. బుధవారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లిలో జరిగిన సీపీఐ శతవసంతాల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, ఆసమస్యలు పరిష్కారమయ్యేంతవరకు తమ పోరాటాలు ఆగవన్నారు. ప్రజలకు అండగా ఉండేది సీపీఐ పార్టీ ఒక్కటేనన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటాలు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జితేందర్‌రెడ్డి, మండదపు రాణి, బెజవాడ రవిబాబు, పూట్ల కొండల్‌రావు, ప్రకాశరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని హమాలీల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, హమాలీలు

మధిర రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎగుమతి, దిగుమతి రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సివిల్‌సప్లయి హమాలీలు బుధవారం గోదాము వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, సీఐటీయూ నాయకులు శీలం నర్సింహారావు, మందా సైదులు మాట్లాడుతూ ఎగుమతి, దిగుమతి రేట్ల ప్రకారం జీవో విడుదల చేసి పెరిగిన రేట్లకు అనుగుణంగా హమాలీలకు ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రేట్ల ఒప్పందం డిసెంబరుతో ముగిసిందని, 2024, 25 సంవత్సరాల నూతన రేట్ల ఒప్పందాన్ని కోరుతూ పలు దఫాలుగా ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పడకంటి మురళీ, తేలప్రోలు రాధాకృష్ణ, నామాల శ్రీను, ఎర్రబోయిన రాము, నాగమల్లేశ్వరరావు, చింతల నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి: డీఎం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ వాడొద్దని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం యూ.రాజ్యలక్ష్మి తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో సందర్భంగా బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చాలా ప్రమాదమని, డ్రంకెన్ డ్రైవ్ నిషేదమని, వాహనాన్ని ఓవర్ టేక్ చేయు సమయంలో డ్రైవర్లు జాగ్రత్తతో ఉండాలన్నారు. అతివేగం ప్రమాదకరమని, వాహనాన్ని నడిపేటప్పుడు నిర్ణీత మార్గంలో రోడ్డు నియమాలు పాటిస్తూ నడపాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకుంటే ప్రమాదాలు చాలావరకు జరగవని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ తదితరులున్నారు.

వైరాలో..

వైరా, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాలను బుధవారం తమ కార్యాలయంలో వైరా మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహన డ్రైవర్లకు ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యాలయ సిబ్బంది, వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతా మాసోత్సవాల ర్యాలీలో పాల్గొన్న ఎంవీఐ వరప్రసాద్

సంకల్ప సిద్ధికి నూతన సంవత్సరం నాంది కావాలి

» సినీ నిర్మాత సీ.కల్యాణ్



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సినీనిర్మాత సీ.కల్యాణ్

తల్లాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సంకల్ప సిద్ధికి నూతన నూతన సంవత్సరం నాంది కావాలని సినీ నిర్మాత సీ.కల్యాణ్ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని అన్నారుగూడెం గ్రామానికి చెందిన దాసరి పద్మ స్మారక యువజన సాంస్కృతిక సమాఖ్య, దాసరి నారాయణరావు, పద్మ మెమోరియల్ నీడా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను బుధవారం హైదరాబాద్‌లో దర్శకనిర్మాతలు రేలంగి నర్సింహారావు, తుమ్మలపల్లి రాంసత్యనారాయణతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడుతూ పట్టుదల, కార్యదీక్షిత, ప్రేమకు, ప్రతిభకు దర్శకరత్న దాసరి నారాయణరావు నిలువెత్తు నిదర్శనమన్నారు. వారి ఆశయ సాధన కోసం దాసరి పద్మ స్మారక యువజన సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు గుమ్మా నరేష్ విస్తృత సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సినీ నిర్మాత తుమ్మలపల్లి రాంసత్యనారాయణ మాట్లాడుతూ నారాయణరావు, పద్మ దంపతులను స్మరింపజేస్తున్న గుమ్మా నరేష్ అభినందనీయుడన్నారు. సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు మాట్లాడుతూ చలనచిత్ర రంగంలో ఎంతో ఎత్తుకు ఎదిగినప్పటికీ సామాన్యలను సైతం అక్కున చేర్చుకున్న సర్వజన శ్రేయోభిలాషి దాసరి నారాయణరావు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమాఖ్య సమన్వయకర్త దుగ్గిదేవర అజయ్‌కుమార్, సినీ సహదర్శకుడు అడపాల వెంకటేశ్వర్లు, కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫారసు మేరకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు కంభం నాగేశ్వరరావు, ముత్తినేని వెంకటేశ్వర్లు, ఆలస్యం బసవయ్య, ఎల్లంపల్లి చిన్న అప్పారావు, వెచ్చా మంగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుశీల విద్యాసంస్థల అధినేత కేవీకి పితృవియోగం



అప్పారావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కొండబాల, లింగాల

మధిర రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలోని సుశీల విద్యాసంస్థల అధినేత కరివేద వెంకటేశ్వరరావుకు పితృవియోగం కలిగింది. కరివేద వెంకటేశ్వరరావు, రామారావుల తండ్రి కరివేద అప్పారావు(88) బుధవారం మధిరలోని అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావులు ఆయన కుటుంబానికి తమ సానుభూతి తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న వెంకటరెడ్డి దంపతులు

మధిర రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం కృష్ణాపురం చర్చిలో బుధవారం క్రైస్తవులకు మధిర భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, విద్యాలత దంపతులు నూతన సంవత్సరం సందర్భంగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ శ్యామ్ మాట్లాడుతూ వెంకటరెడ్డి దంపతులు ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా దుస్తులు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సన్మానించారు.

కల్లూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో పలువురు వృద్ధులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు తోపుడుబండి, స్ఫూర్తిఫౌండేషన్ తరుపున రూ.30 వేల విలువ గల రగ్గులను తోపుడుబండి ఫౌండేషన్ అధినేత్రి ఉషసాదిక్‌అలీ సుమారు 250 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ తోపుడు బండి ఫౌండేషన్ తరుపున కల్లూరు పరిసర ప్రాంతాల్లో ఎంతోమంది పేదలకు పలు విధాలుగా సేవ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల హృదయాల్లో సాదిక్‌అలీ చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దయాల కిషోర్‌దత్, సుజాత, అన్నపూర్ణ, అఫ్రోజ్, మాజీ ఎంపీటీసీ మాదిరాజు లక్ష్మణరావు, ఇజహర్, మేరిగోల్డ్ తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో వృద్ధురాలికి రగ్గును అందజేస్తున్న ఉష సాధిక్‌అలీ

ఏన్కూరు పోలీస్‌స్టేషన్‌కు కొత్త హంగులు

ఏన్కూరు, జనవరి1(ఆంధ్రజ్యోతి): ఏన్కూరుపోలీసుస్టేషన్ ను ఎస్ఐ రఫి ప్రత్యేకచొరవ తీసుకుని దగ్గర ఉండి, నూతన హంగులు ఏర్పాటు చేయించారు. గతంలో పోలీస్‌స్టేషన్ ఇరుకుగా అసౌకర్యంగా ఉన్న భవన రూపురేఖలను పూర్తిగా మార్చారు. భవనానికి ప్రత్యేక గదులను కేటాయించి, కొత్తగా టైల్స్, రంగులు, లైట్లు ఏర్పాటు చేయడంతో విద్యుత్ కాంతులతో విరజిల్లుతుంది. సిబ్బంది విధులు నిర్వహించేందుకు అనువుగా గదులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఫిర్యాదుదారులు కూర్చోవడానికి హాలు, అతిథులకు గెస్ట్‌రూఏంలు ఏర్పాటు చేయడంతో స్టేషన్‌కు సకల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టయింది. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నారు. ప్రధాన రహదారిలో నిరుపయోగంగా పనిచేయని సీసీ కెమె రాలు స్థానంలో కొత్త వాటిని అమర్చి నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్ చేస్తూ గట్టినిఘా ఏర్పాటు చేశారు. తరచు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ మైనర్లు, నడిపే వాహనాలు సీజ్ చేస్తూ ప్రమదాల నివారణకు చర్యలు చేపడుతున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ రఫిని మండల ప్రజలు అభినందిస్తున్నారు.



కొత్త హంగులతో ఏర్పాటైన భవనం

గోశాలకు సామగ్రి అందజేత



వెంకటయ్య, అరుణ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

వైరా, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వైరాలోని వేదపాఠశాలలో ఉన్న గోశాలకు అవసరమైన సామగ్రిని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చింతనిప్పు వెంకటయ్య, అరుణ దంపతులు బుధవారం అందజేశారు. ఈ దంపతులను లయన్స్‌క్లబ్ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో చింతోజు నాగేశ్వరరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, పెనుగొండ ఉపేంద్రరావు, అబ్బూరి రమేష్, మరికంటి రాంగోపాల్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు



వైరాలో కేక్‌ను కట్‌చేస్తున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్



కారేపల్లిలో కేక్ తినిపించుకుంటున్న యువకులు

వైరా/కారేపల్లి/కొణిజర్ల/చింతకాని/వేంసూర్, జనవరి1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను ఆయా మండలాల్లో, పట్టణాల్లో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువతీ, యువకులు ఆడిపాడారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రామాలయంలో తులసీదళాల రామసంకీర్తన చేస్తున్న మహిళలు



వేంసూరులో పూజలు చేస్తున్న భక్తులు





చింతకాని, కొణిజర్లలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు